క్లుప్తంగా

అబ్దుల్ రహీంకు సన్మానం



అబ్దుల్ రహీంను సన్మానిస్తున్న ఎంపీ సురేష్ షెట్కార్

నారాయణఖేడ్: జాతీయ మానవ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర చైర్మన్‌గా ఇటీవల ఎన్నికైన నాగల్‌గిద్ద మండలం ఏస్గి గ్రామానికి చెందిన అబ్దుల్ రహీంను మంగళవారం జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ సన్మానించారు. ఇదివరకు అంబేడ్కర్ పూలే సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడిగా చేసిన సేవలను కొనియాడుతూ ప్రజల హక్కులు, రాజ్యాంగ పరిరక్షణ కోసం కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయనకు ఎంపీ సూచించారు.

టీబీ నిర్మూలనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ప్రశాంత్‌కుమార్

సంగారెడ్డి టౌన్: టీబీ నిర్మూలనకు ప్రతిజ్ఞకరూ తీసుకోవాలని జిల్లా పారిశ్రామిక కేంద్రం జనరల్ మేనేజర్ ప్రశాంత్కుమార్ అన్నారు. సంగారెడ్డి పట్టణంలో ఐ యాం ఫర్ టీబీ ప్రాజెక్టులో భాగంగా టీబీ అలర్ట్ ఇండియా వారు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివిధ పరిశ్రమల్లో పని చేసే కార్మికులకు టీబీ సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఒకరి నుంచి మరొకరికి సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుందన్నారు. టీబీ వచ్చినవారు అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేశ్వరి, ప్రాజెక్టు సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



యాదయ్య

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): ఇంటి నుంచి వెళ్లి వ్యక్తి అదృశ్యమయ్యాడు. సీఐ మహేశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్ మండలంలోని అనంతసాగర్ గ్రామం నుంచి ఈ నెల 12న ఆటో ఎక్కి సొంత గ్రామమైన వెల్టూర్ గ్రామానికి వెళ్తున్నాని చెప్పి గ్రామానికి చేరుకోలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. యాదయ్య మూడేళ్లుగా మతిస్థిమితం లేకుండా పక్షవాతంతో బాధపడుతున్నాడు. యాదయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

తప్పిపోయిన బాలుడు కన్నవారి చెంతకు..



బాలుడిని అప్పగిస్తున్న సీఐ భాస్కర్

సంగారెడ్డి టౌన్: ఇంటి వద్ద ఆడుకుంటూ బయటికి వెళ్లి బాలుడు అదృశ్యం కాగా, కొన్ని గంటలల్లోనే తల్లిదండ్రుల వద్దకు పోలీసులు చేర్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని నేతాజీనగర్‌కు చెందిన గోవర్ధన్ కుమారుడు అనంత సాయి తేజ(6) ఇంటి ఎదుట ఆడుకుంటూ బయటకు వెళ్లాడు. ఆవరణలో లేకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారిని, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పట్టణ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం జరిగింది. దీంతో నలందనగర్‌కు చెందిన ఓ వ్యక్తి బాలుడిని గుర్తు పట్టి స్టేషన్‌లో అప్పగించారు. అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు.

నర్సాపూర్‌లో అంగన్‌వాడీల ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్: నర్సాపూర్‌లో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం అంగన్‌వాడీలు ర్యాలీ చేపట్టారు. ర్యాలీని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరళకుమారి అంగన్‌వాడీ కేంద్రాల సేవలను వివరించారు. ర్యాలీలో కౌన్సిలర్లు సురేష్, యాదగిరి, రాంచందర్, ఆయా పార్టీల నాయకులు, అంగన్‌వాడీ టీచర్ అన్నపూర్ణ పాల్గొన్నారు.

● బోనం.. సంబురం

వట్‌పల్లిలో విద్యార్థులు మంగళవారం ఆషాఢ బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా విద్యార్థినులు చీరలు కట్టుకొని.. బోనాలతో ముందుకు సాగారు. శివసత్తుల, పోతురాజు, గ్రామీణ దేవతల వేషధారణలతో విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. బోనాల శోభాయాత్ర ప్రధాన రహదారి మీదుగా గ్రామంలోని దుర్గమాత ఆలయం వరకు సాగింది.

వట్‌పల్లి(అందోల్)



ఉత్సవాల్లో పాల్గొన్న విద్యార్థినులు



దుర్గమాత వేషధారణలో విద్యార్థిని

కొనసాగుతున్న బదిలీలు



సంగారెడ్డి టౌన్: జిల్లాలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ క్రాంతి ఆదేశించారు. జీఓ 80 ప్రకారం మంగళవారం పంచాయతీ కార్యదర్శుల బదిలీలు కొనసాగాయి. కార్యక్రమంలో డీపీఓ సాయిబాబా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తీరనున్న కష్టాలు

కంకోల్‌లో ఏర్పాటు కానున్న 30 పడకల ఆస్పత్రి

- 20 గ్రామాలకు అందనున్న అత్యవసర వైద్య సేవలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఆయా గ్రామాల ప్రజలు



30 పడకల ఆస్పత్రి ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ (ఫైల్)

మునిపల్లి(అందోల్): కంకోల్ చౌరస్తా సమీపంలో 30 పడకల ఆస్పత్రి (ప్రాథమిక ఆరోగ్య కేంద్రం) ఏర్పాటుకు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ 2024 ఫిబ్రవరి 11వ తేదీన శంకుస్థాపన చేశారు. ఈ ఆస్పత్రి ఏర్పాటయితే పరిసర గ్రామాల ప్రజలకు 24 గంటల పాటు వైద్య సేవలు అందనున్నాయి. ఆస్పత్రి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. కంకోల్ చౌరస్తా 65వ నంబర్ జాతీయ రహదారి కావడంతో పాటు పరిసర గ్రామాలకు అందుబాటులో ఉండేవిధంగా ఏర్పాటు అవుతుండటంతో అత్యవసర సేవలు త్వరగా అందుతాయని ఆయా గ్రామాల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అత్యవసర సేవలు

మునిపల్లిలో ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కూడా 24 గంటల పాటు వైద్యసిబ్బంది ప్రతిరోజు ఉదయం 9 గంటలకు రోగులకు చికిత్సలు నిర్వహిస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు రక్త పరీక్షలు నిర్వహిస్తూ మందులను పంపిణీ చేస్తున్నారు. దీర్ఘకాలిక రోగులకు ఆయుర్వేద మందులను సైతం పంపిణీ చేస్తున్నారు.

8 సబ్ సెంటర్ల ఏర్పాటు

దూర ప్రాంతాలకు వెళ్లకుండా మునిపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆయా గ్రామాల్లో 8 సబ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. సబ్‌సెంటర్లలో సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లను నియమించి వైద్య సేవలు అందిస్తున్నారు. పెద్దలోడి, బుస్సారెడ్డిపల్లి గ్రామాల్లో సొంత భవనాలు ఏర్పాటు చేయగా మిగతా ఆరు సబ్‌సెంటర్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతిరోజు 70–100 మంది సాధారణ రోగులకు చికిత్సలు అందిస్తున్నారు. సోమ, శుక్రవారం ఆయా గ్రామాల రోగులకు చికిత్సలు, ప్రసవాలు, సాధారణ వ్యాధులకు చికిత్సలు నిర్వహిస్తున్నారు. నెలకు 12–17 ప్రసవాలు చేస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. మునిపల్లి ప్రాథమిక కేంద్రం పరిధిలోని 20 గ్రామాల ప్రజలు వైద్య సేవలను పొందుతున్నారు.

వైద్య సేవలు బాగున్నాయి



ఎప్పుడు వెళ్లినా వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ వైద్యం అందిస్తున్నారు. అవసరమైనవారికి చికిత్సలు నిర్వహించి మందులను పంపిణీ చేస్తున్నారు. మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ల పనితీరు బాగుంది. సాధారణ రోగులతో పాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నారు. కంకోల్ చౌరస్తాలో మరో 30 పడకల ఆస్పత్రి నిర్మిస్తుండటంతో అందరికీ వైద్య సేవలు అందే అవకాశం ఉంది.

– నర్సమ్మ, అంతారం గ్రామం

మెరుగైన వైద్యం అందిస్తున్నాం



ఆరోగ్య కేంద్రానికి వచ్చే ఆయా గ్రామాల రోగులకు ఎప్పటికప్పుడు చికిత్సలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తున్నాం. గర్భిణులు, బాలింతలను పరీక్షించి అవగాహన కల్పిస్తున్నాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు జరిగేవిధంగా గ్రామాల్లో ఆశావర్కర్లతో గర్భిణుల వివరాలను సేకరిస్తూ డెలివరీలు చేస్తున్నాం. పాము, కుక్క కాటుతో పాటు తదితర చికిత్సలకు మందులు అందుబాటులో ఉన్నాయి.

– డాక్టర్ మనుజారెడ్డి, మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పత్తి, సోయా సాగుపై అవగాహన

పత్తి, సోయా సాగుపై అవగాహన



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ నూతన్‌కుమార్

నారాయణఖేడ్: పత్తి, సోయా పంటల చీడపీడల నివారణకు ఎప్పటికప్పుడు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని నారాయణఖేడ్ సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) నూతన్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని అబ్బెంద, మనూరు మండలంలోని ఎల్గోయి గ్రామాల్లో పత్తి, సోయా వ్యవసాయ క్షేత్రాలను మంగళవారం సందర్శించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు ఎదగడానికి ముందు గుంటుకలు తోలడంతో కలుపును నివారించవచ్చన్నారు. గాలి, సూర్యరశ్మి మొక్కలకు తగిలి మొక్కలు ఏపుగా ఎదుగుతాయన్నారు. ఈ సమయంలోనే కలుపు నివారణ చేపట్టిన తర్వాత కాంప్లెక్స్ ఎరువులు వేయరాదని సూచించారు. పత్తి పంటలో రసం పీల్చే పురుగు, తెల్లదోమ, పచ్చదోమ, పేను నివారణకు ఎసిటీమైఫ్రీడ్ మందును 0.2 గ్రాములు, లీటర్ నీటిలో లేదా ఇమిడాక్లోపెడ్ 0.25 మిల్లీ లీటర్లలో లీటర్ నీటితో పాటు 5 మిల్లీ లీటర్ల వేపనూనెను కలిపి పిచికారీ చేయాలన్నారు. సోయా పంటలో పచ్చ పురుగును నివారించేందుకు క్లోరిపైరిపాస్ 2 ఎంఎల్, లీటరు నీటికి కలిపి ఉదయం, సాయంత్రం పిచికారీ చేయాలన్నారు. క్లోరిపైరిఫాస్, లాబ్దాసైలోత్రీన్ మందును ఎకరానికి 500 మిల్లీ మీటర్లు, 200లీటర్ల నీటిలో కలిపి ఉదయం 11లోపు లేదా సాయంత్రం 4తర్వాత పిచికారీ చేయాలని సూచించారు. ఆయన వెంట ఏఈవోలు హరీష్, ప్రవీణ్ చోల్కర్ ఉన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని ధర్నా



జిన్నారం(పటాన్‌చెరు): ఆర్టీసీ బస్సులను అదనంగా కేటాయించటంతో పాటు, బస్సులను స్టాప్‌ల వద్ద ఆపాలని కోరుతూ గుమ్మడిదల మండల పరిధిలోని అన్నారం గ్రామ ప్రధాన రహదారిపై విద్యార్థులు మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం సమయంలో ఆర్టీసీ బస్సులను పెంచటంతో పాటు బస్టాప్‌ల వద్ద బస్సులను నిలిపేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు కల్పించుకొని జీడిమెట్ల డీఎంకు సమస్యలను వివరించగా సమస్యను పరిష్కారమని హామీ ఇవ్వటంతో ధర్నా విరమించారు.

అంగన్‌వాడీలకు రిటైర్డ్ బెనిఫిట్స్ ఇవ్వాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు



రిలే నిరాహార దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులు

జోగిపేట(అందోల్): రిటైర్డ్ అంగన్‌వాడీ టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాలకు లక్ష చొప్పున రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని జిల్లా సీఐటీయూ కార్యదర్శి సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీఓ 10 రద్దు, తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడి ఉద్యోగులు గతేడాది 24 రోజులు సమ్మె చేస్తే అప్పటి ప్రభుత్వం అంగన్వాడీ టీచర్లకు రూ.రెండు లక్షలు, ఆయాకు రూ.లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇతర సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయినా నేటికీ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వమైన అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు విద్యాసాగర్, యూనియన్ నాయకులు పార్వతమ్మ, సైదాబీ, అనసూయ, జయమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

జిన్నారం(పటాన్‌చెరు): సీజనల్ వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి అన్నారు. సీజనల్ వ్యాధులపై మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డుల్లో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా కాలనీల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి

కొనో కార్పస్ మొక్కలను తొలగించాలి

సదాశివపేట(సంగారెడ్డి): పర్యావరణానికి ముప్పు కలిగించే కొనో కార్పస్ మొక్కలను తొలగించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డీవైఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ ఉమాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోనో కార్పస్ మొక్కలను తొలగించి వాటి స్థానంలో ఇతర మొక్కలను నాటించాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు ప్రశాంత్ పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

సదాశివపేట(సంగారెడ్డి): ఎటువంటి షరతులు లేకుండా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని తెలంగాణ ప్రజాశక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దొడ్ల వెంకట్ డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం అధికారంలోకి రాగానే రేషన్‌కార్డు ఉంటేనే రుణమాఫీ చేస్తామని ప్రకటించడం సరైంది కాదన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేసి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని తెలిపారు. లేనిపక్షంలో రైతులను కూడగట్టి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కొత్త బస్వరాజ్‌పాటిల్, కార్యదర్శి వీరేష్, జిల్లా అధ్యక్షుడు రవి, ఇన్‌చార్జి బ్రహ్మచార్జి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ రషీద్ పట్టణ అధ్యక్షుడు పవన్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న పర్సు అప్పగింత

నిజాయితీ చాటుకున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్



సుజాతకు పర్సు అప్పగిస్తున్న ఆర్టీసీ అధికారి, నీరజ గ్రేసీ, బస్సు డ్రైవర్

జహీరాబాద్: ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నీరజ గ్రేసీ సోమవారం జహీరాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళుతుండగా అదే బస్సులో పర్సు దొరికింది. పర్సును తెరిచి చూడగా రెండు తులాల బంగారు గొలుసు, తులం ముక్కుపుడక, రెండు ఉంగరాలు ఉన్నాయి. దీంతో ఆమె దొరికిన పర్సును బస్సు డ్రైవర్‌కు అప్పగించగా బస్సు డ్రైవర్ మియాపూర్ డిపో మేనేజర్‌కు అందజేశారు. పర్సులో ఆధార్ కార్డు, ఐడీ కార్డు లభించాయి. వాటి ఆధారంగా పర్సును పోగొట్టుకున్న వ్యక్తిని శంకర్‌పల్లికి చెందిన అంగన్‌వాడీ టీచర్ సుజాతగా గుర్తించారు. ఆమె ఫోన్ నెంబర్ సేకరించి సదరు మహిళను మంగళవారం మియాపూర్ డిపోకు పిలిపించి పర్సు దొరికిన నీరజగ్రేసీ, బస్సు డ్రైవర్ సమక్షంలో బాధితురాలికి అప్పగించారు. ఈ సందర్భంగా నీరజ గ్రేసిని శాలువాతో సన్మానించి అభినందించారు.

సంక్షిప్త వార్తలు

◆ గురుకులం ప్రిన్సిపాల్‌గా లింగారెడ్డి

నారాయణఖేడ్: నారాయణఖేడ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్‌గా లింగారెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కొంత కాలంగా రెగ్యులర్ ప్రిన్సిపాల్ లేకపోవడంతో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా మీరావళి కొనసాగారు. ఈ సందర్భంగా లింగారెడ్డిని పేరెంట్స్ కమిటీ సభ్యులు బంగారు రాజు, శంకర్, నర్సింహులు ఘనంగా సన్మానించారు.

◆ స్వలాభం కోసమే కాంగ్రెస్‌లో చేరిక

పటాన్‌చెరు టౌన్: స్వలాభం కోసమే ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారని బీజేవైఎం జిల్లా కార్యదర్శి సందీప్ మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు నియోజకవర్గాన్ని దోచుకున్నాడని, మళ్లీ దోచుకోవడానికి అధికారంలో ఉన్న కాంగ్రెస్‌లో చేరాడని విమర్శించారు. రాబోయే రోజుల్లో పటాన్‌చెరులో బీజేపీ జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

◆ గ్రంథాలయ పరిషత్ చైర్మన్‌కు సన్మానం

నారాయణఖేడ్: రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన రియాజ్‌ను ఎమ్మెల్యే సంజీవరెడ్డి మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఆయన వెంట యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్ పాటిల్ ఉన్నారు. కాగా అంతకుముందు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అన్వేష్‌రెడ్డిని కూడా ఎమ్మెల్యే సన్మానించారు.

◆ బాధ్యతలు స్వీకరణ

నారాయణఖేడ్: డిప్యూటీ తహశీల్దార్‌గా రాజుపటేల్, ఆర్ఐగా మాధవరెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వీరిని బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, నాయకులు రాజు ఘనంగా సన్మానించారు. డీటీగా విధులు నిర్వహించిన అనుదీప్ చౌటకూర్‌కు, ఆర్ఐ శ్యాంరావు న్యాల్‌కల్‌కు బదిలీ అయ్యారు.

◆ స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు

సంగారెడ్డి: కాంగ్రెస్‌లో చేరిన 10మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసినవారిలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఉన్నారు.

◆ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేయాలి

జహీరాబాద్ టౌన్: కల్యాణలక్ష్మి, షాదీముబార్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేయాలని మల్చెల్మ గ్రామ బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన సమావేశంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ఆనంద్, మాజీ ఎంపీటీసీలు ఇస్మాయల్, మోహియోద్దీన్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు వెంట వెంటనే ఇచ్చేవారన్నారు. కానీ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంతవరకూ ఒక్క చెక్కు కూడా ఇవ్వకపోవడం విచారకరమన్నారు. సమావేశంలో నాయకులు రమేష్, బాబుమియా, సుభాష్, పెంటప్ప, గోపాల్ పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్ నేత నీలం మధుకు ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన జ్ఞానేశ్వర్ ముదిరాజ్ బుధవారం 17వ తేదీన నిర్వహించనున్న తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్‌ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న జ్ఞానేశ్వర్‌కు నీలం మధు శుభాకాంక్షలు తెలిపారు.

◆ ఘనంగా బోనాల జాతర

సంగారెడ్డి: ఆషాఢం సందర్భంగా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో రేణుకఎల్లమ్మ (ఎఫ్ఆర్ఎస్), నల్ల పోచమ్మ అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంగారెడ్డి నాయీ బ్రాహ్మణ సేవ సంఘం గౌరవ అధ్యక్షుడు నాగభూషణం, అధ్యక్షుడు మానిక్ ప్రభు, యువ నాయకులు శ్రీశైలం, రాము, ఆంజనేయులు, చరణ్, సాయినాథ్, ప్రసాద్, హన్మంత్, అనిల్ పాల్గొన్నారు. అదేవిధంగా మాస్టర్ మైండ్ స్కూల్, ఈ–టెక్నో స్కూల్లో కరస్పాండెంట్ నవనీత–సంతోష్ ఆధ్వర్యంలో బోనాల పండుగను విద్యార్థులతో కలిసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ రుణమాఫీని రైతులందరికీ వర్తింపజేయాలి

సంగారెడ్డి టౌన్: రూ.2 లక్షల రుణమాఫీని రైతులందరికీ వర్తింపజేయాలని భారతీయ కిసాన్ సంగ్ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సంగారెడ్డిలో రైతులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2018 నుంచి కాకుండా అంతకు ముందు ఉన్న రుణాలను కూడా మాఫీ చేయాలన్నారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంగ్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

◆ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఆత్మకూర్ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు తమ్మలి రవి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తలసేమియా, గర్భిణులు, ప్రమాదాల్లో గాయపడిన వారు రక్తం కోసం పాట్లు పడుతున్నారన్నారు. ఇటీవల ఆత్మకూర్ గ్రామానికి చెందిన జగంపేట శివకుమార్ బ్రెయిన్ ట్యూమర్ సమస్యతో బాధపడుతుండడంతో రక్తం అవసరం వచ్చిందన్నారు. దీంతో గ్రామానికి చెందిన కొండాపురం వికాస్, అయ్యగారి మల్లికార్జున్ స్వామి, జోగు రవి, గంధే రాజు రక్తదానం చేసి మానవత్వం చాటుకున్నారని గుర్తు చేశారు.

◆ విద్య ప్రాముఖ్యతపై అవగాహన

మునిపల్లి(అందోల్): మండలంలోని చిన్నచల్మెడ గ్రామంలో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శైలజ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల తల్లిదండ్రులకు విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ భూ సమస్యలు పరిష్కరించాలి

మునిపల్లి(అందోల్): పెండింగ్‌లోని ధరణి భూ సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వేలకు పైగా ఉన్న ధరణి భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. మునిపల్లి మండల రైతు సంఘం నాయకులు రమేశ్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

◆ ఎమ్మెల్యేమహిపాల్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

పటాన్‌చెరు: కాంగ్రెస్‌లో చేరిన పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కాంగ్రెస్ తెల్లాపూర్ మున్సిపల్ అధ్యక్షుడు చిలకమర్రి ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు డోకూరి రామ్మోహన్‌రెడ్డి, నాగేశ్‌యాదవ్, మాజీ వార్డు సభ్యులు బాబు, అతీక్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ తదితరులు మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

◆ భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు

ఝరాసంగం(జహీరాబాద్): మండల కేంద్రంతో పాటు కుప్పానగర్, పొట్టిపల్లి, ఎల్గోయి, తుమ్మన్పల్లి తదితర గ్రామాలలో మొహర్రం వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లతో ఊరేగింపు నిర్వహించారు.

న్యాల్‌కల్ మండలంలో...

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో మొహర్రం ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పీర్లను గ్రామాల్లోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. పీర్లకు గ్రామస్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.